



ముందు వేసవిలో ఒక రాత్రి హార్సిలీహిల్స్‌లో గెస్టుహౌసులో పరాత్పరరావూ నేనూ కాలక్షేపంలో భాగంగా 'ప్రేమ'ను గురించి మాట్లాడుకుంటున్నాం.

"వయస్సులో వున్న మగాడికీ ఆడదానికీ మధ్య ఉత్పన్నమయ్యే ఉద్రేకాన్ని నేను 'కామం' అనే

అంటాను. ప్రేమ అనే మాటకు వాళ్ళమధ్య తావులేదు. ప్రేమ అనే పేరుతో ఒకవ్యక్తిని జీవితాంతం ఆరాధించేది మజ్నూలాంటి పూర్వ కాలపు మనుషులు. అదిగూడా కథల్లోనే. ఈ తరంలో అలాంటి వాళ్ళెవ్వరూ లేరు" చాలా తేలిగ్గా అన్నాడు పరాత్పరరావు.

పరాత్పరరావుతో వాదించి నచ్చ జెప్పడం కష్టం. "కొంతమందిలో ఒక రకమైన ఉద్రేకమే ప్రేమగా మారి జీవితాంతం వున్మత్తుల్ని చేస్తుంది. చివరికి ప్రాణాలతో బాటే ఆ పెనవేసుకున్న ప్రేమా గాలిలో కలిసి పోతుంది! ఊర్మిళ జీవితమే అందుకు సరియైన ఉదా హరణ." ఉపమానంతో పరాత్పర రావును ఒప్పించవచ్చుననే ఉద్దే శ్యంతో అన్నాను.

"చెప్పండి! ఆ ఊర్మిళ కథే మిటో! వింటాను".... అన్నాడు పరాత్పరరావు.

"ఇది కథగాదు ....నిజమైన జీవితం.... నిజంగా కథకు సరి పోయే జీవితం...." చెప్పడం మొదలు పెట్టాను.

* *

"నాలుగేళ్ళ క్రితం మాట. అప్పుడు నేను అరకులోయలో గవర్నమెంటు డిస్పెన్సరీలో పని జేస్తున్నాను.

ఒకరోజు తెల్లవారు ఝామున్నే ఎవరో నాగది తలుపు తట్టారు. తలుపు తీసాను. చత్వారపుటద్దాల్ని ఎగత్రోసుకుంటూ లాంతరు పట్టు కొని అరవై ఏళ్ళ మనిషి లోనికి వచ్చాడు. తనను తనే పరిచయం చేసుకున్నాడు.

అతని పేరు సన్యాసిరావు అరకు మల్టీపర్పస్ స్కూల్లో టీచరుగా రిటైరయ్యాడు. స్వగ్రామం మంద పేట. రిటైరైన తర్వాత గూడా లంబాడీ వాళ్ళ సామాజిక వికాసం కోసం అంతో ఇంతో సేవజేస్తూ వుండిపోయాడు.

అతనితోబాటు ఇంకో లంబాడీ మనిషి వచ్చాడు. "డాక్టరుగారూ! మీరు దయచేసి చెమికలగూడెం అర్జెంటుగా రావాలి.... అక్కడ ఒక పేషెంటుకు సీరియస్‌గా వుంది. మీ మీద ఆశలు పెట్టుకొని నడిచి వచ్చా. మీ మూడు మైళ్ళా.... ఓరేయ్ సహదేవా! అయ్యగారి బ్యాగ్ ఎత్తుకోరా....పోదాం" కేకే శాడు సన్యాసిరావు.

బయట నిల్చున్న లంబాడీ మనిషి లోనికి వచ్చాడు. నాకిక ఇంకొక ఆలోచనకు తావివ్వలేదు వాళ్ళు....నా టేబిల్ మీద బ్యాగ్ సహదేవుడి చేతికిచ్చాను.

చెమికల గూడెం చివరన ఒక చిన్నకుటీరం లాంటి రెల్లు ఇంటి ముందు ఆగింది మా నడక. అప్పుడే తెల్లవారుతూంది .... కంచెకట్టిన ప్రాకారం.... ముగ్గులు తీర్చిన ముంగిలి. పారిజాతం చెట్టూ. మందారం మొక్కలూ..... చిన్నపాక... అందులో రెండు మేకలూ... చక్కగా నేసిన కప్పు...రంగులు తీర్చిన గోడలూ... పుస్తకాలలో కయితే శబరి ఆశ్రమానికి సరిపోతుంది.

లోనికి వెళ్లాము. నేల శుభ్రంగా అలికివుంది. నులక మంచం మీద కంబళిపైన ఒక స్త్రీ పడుకొని వుంది. ఆ మంచం క్రింద ఒక కుక్క పడుకొని వుంది...ఆమెది శబరి వయస్సుకాదు...నలభై ఏళ్ళ కంటె ఎక్కువ వయస్సు ఉండదు. ముఖం పాలిపోయింది... ఒళ్ళంతా పాండవ తేలిపోయింది...ఆయాసపడుతూంది.

"ఊర్మిళా! ఇదిగో చూడు.. డాక్టరు బాబు వచ్చారు" లాంతరు అర్పివేస్తూ అన్నాడు సన్యాసిరావు.

సహదేవుడు ఆమెకు సాయం చేసి లేపాడు. ఊర్మిళ రెండు చేతులెత్తి నాకు నమస్కరించింది. చేతుల నిండా తొడిగిన దంతపు గాజులు వింతగా శబ్దం చేశాయి. ఆమె దుస్తుల్లో పొదిగిన అద్దపు ముక్కలు తళుక్కున మెరిశాయి. ముసుగు సవరించుకొని ఆయాసపడుతూ కూర్చుంది. సహదేవుడి వైపు తిరిగి సైగజేసింది. వాడు బయటికి వెళ్ళిపోయాడు.

నేను ఊర్మిళను పరీక్షచేశాను.

"విశాఖపట్నం పెద్దాసుపత్రికి తీసుకుపోయి చేర్పిస్తే మంచిది... ఆమెలో రక్తం బొత్తిగా లేదు... రక్తమెక్కిస్తే తప్పకుండా బ్రతుకుతుంది" సన్యాసిరావును బయటకు పిలిచి చెప్పాను.

సన్యాసిరావు లోనికి వెళ్ళి ఊర్మిళతో మట్లాడివచ్చాడు. "ఆమె ససేమిరా ఒప్పుకోవడం లేదు డాక్టరుగారూ! తన జన్మ ఇక్కడే కడతేరిపోవాలని పట్టుబట్టింది" అన్నాడు సన్యాసిరావు.

"అలా పట్టుబడితే తప్పక ఇక్కడే త్వరలోనే కడతేరిపోతుంది...ఈ లంబాడీలకు ఇంకా మూర్ఖత్వం పోలేదు" అన్నాను.

"జీవించాలని ఆశ వున్నప్పుడు లంబాడీ అయినా లక్షాధికారయినా ప్రాణంకోసం తాపత్రయపడతాడు. ... ఈమెకు జీవించాలనే ఆశ పూర్తిగా నశించింది. ఆమె బాధ చూడలేకనే మేమయినా మీ దగ్గరికి పరుగెత్తిరావడం...ఆమె ఓ

విచిత్రమైన మనిషి" అన్నాడు సన్యాసిరావు.

సహదేవుడు టీ తెచ్చాడు. లోపలికెళ్ళి కూర్చుని నేను, సన్యాసిరావూ టీ త్రాగాము.

"చూడమ్మా! నా మాట విను. నిన్ను నేను తీసుకెళ్ళి పెద్దాసుపత్రిలో చేరుస్తాను... లేకపోతే నువ్విక్కడ మరీ బాధపడిపోతావు" మెల్లిగా అన్నాను ఊర్మిళతో.

ఆమె జవాబుగా వద్దన్నట్టు తల త్రిప్పింది.

"ఇక్కడ నిన్నెవరుచూస్తారు" అన్నాను. ఆమె సహదేవునివైపు చూపింది.

"మా యింటిదీ నేనూ, సూత్తున్నాందొరా" సహదేవుడన్నాడు.

ఆయాసం తగ్గడానికి ఇన్జెక్షను ఇచ్చాను. ఇంకా కొన్ని మందులిచ్చి, మరురోజు మళ్ళీవచ్చి చూస్తానని చెప్పి తిరిగి బయలుదేరాను. సన్యాసిరావు నాతోబాటు తోడుగా వస్తున్నాడు. "ఈమెకెవరూ లేరా" సన్యాసిరావును అడిగాను

"తల్లీ తండ్రీకాలమైపోయారు. తండ్రి తేనె తీసేవాడు. తల్లి వెదురుబుట్టలల్లేది. నేను ఇక్కడికి వచ్చినప్పట్నుంచీ ఎరుగుదును వాళ్ళను. కలరా వచ్చి వాళ్ళుచచ్చిపోయి గూడా పదుహేనేళ్ళు దాటింది. ఊర్మిళ చాలా విచిత్రమైన మనిషి" చెప్పడం ప్రారంభించాడు

"ఆమెకు పెళ్లికాలేదా?" ఆసక్తిగా అడిగాను.

"చేసుకోలేదు. ఆమె నలభైఏళ్ల జీవితమూ ఒక వ్యక్తి మీద ప్రేమకు వదిలేసింది. అతనిపై అల్లుకొన్న అనురాగంతో తన మనుగడ ముడివేసుకుంది. ఆమె ఆశలు ఫలించలేదు. అయినా ఆమెకు అతనిపై మమతపోలేదు .... ఇప్పటికీ అతణ్ణి మనసులో ఆరాధిస్తూంది" అన్నాడు సన్యాసిరావు.

"అతనిప్పు డెక్కడున్నాడు" అడిగాను.

"పేటలో మందులషాపు పెట్టుకొని ఉన్నాడు" అన్నాడు.

"పేటలో ఉన్నది ఒకే ఒక మందులషాపు. దాని యజమాని భానోజీ...." సందేహంగా అన్నాను.

"అవును, అతనే—ఆ భానోజీరావునే ఊర్మిళ ఆరాధిస్తున్నది"

"అతనికి పెళ్ళాం, పిల్లలూ"

"ఉన్నారు. ఊర్మిళ పదేళ్ల పిల్లప్పటినుండి పేటకు పోతుండేది. ఆమె అమ్మా నాన్నా తేనె, వెదురు బుట్టలూ అమ్ముకోవడానికి పేటకు వెళ్లేవారు, ఊర్మిళగూడా తేనెజాడీ

నెత్తిన పెట్టుకొని కదిలేది.

భానోజీరావు ఇంట్లో వాడుకగా తేనె ఇచ్చేవాళ్ళు వీళ్ళు. అప్పటికి భానోజీరావు వయస్సు పదిహేనేళ్ళుండవచ్చు. అక్కడే ఊర్మిళ చూపు భానోజీ మీదికి మళ్ళింది. పేటకు పోయినప్పుడల్లా అణా. బేడా ఊర్మిళకిచ్చే వాడు ఆమె నాన్న. అదంతా పోగుజేసి ఒకరోజు చాటుగా భానోజీకి ఇచ్చింది. భానోజీ అమాంతగా ఊర్మిళను కౌగలించుకున్నాడు.... ముద్దు పెట్టుకున్నాడు.

ఊర్మిళ కానాడే ఉద్రేకం కలిగింది....అప్పట్నించీ అతని మీద పిచ్చి ప్రేమను పెంచుకొన్నది.... అతణ్ని తలచుకొని పరవశించి పోయేది ఊర్మిళ.

ఊర్మిళ తానే స్వయంగా వీథులు తిరిగి తేనె అమ్ముకునే వయసుకు వచ్చింది. భానోజీ ఇంటికి ఆమె ఒక్కర్తే వెళ్ళేది. తేనె కొలవడంలోకొంత, ధరలోకొంత ఎలాగో ఓలా కొంతడబ్బు మిగిల్చేది... దాంతో భానోజీకి సిగరెట్లూ, టిఫిన్లూ గడిచిపోయేవి. ఊర్మిళ భానోజీకి డబ్బు ఇచ్చినప్పుడు, ఊర్మిళకు అతడిచ్చే బహుమానాలు ....ఒక కౌగిలి....ఒక ముద్దు."

మేము హాస్పిటల్‌కు చేరుకున్నాం. కాఫీ తెప్పించాను. త్రా. చెప్పడం కొనసాగించాడు సన్యాసిరావు.

"భానోజీ కాలేజీ చదువుకు విశాఖపట్నం వెళ్లాడు. ఊర్మిళ పెద్దదై మూలకూర్చుంది. భానోజీ దూరమైనా అతని తాలూకు వింత అనుభూతులు ఊర్మిళలో ఎనలేని మోహాన్ని రేపాయి. అలాగే మూడేండ్లు గడిసింది.

భానోజీ బి.య్యే పరీక్షవ్రాసి పేటకొచ్చాడు. ఊర్మిళకు ఆ సంగతి తెలిసింది. పేటకుపోయి అతణ్ణి చూసి రావాలని ఒకటే ఉబలాటం. ఎలాగో సంతపేరుతో పేటకు చేరుకుంది ఊర్మిళ.

భానోజీ ఇంటికెళ్లింది... అతని తల్లి గేటుదగ్గరే ఆపి అడిగింది.

"ఏంపిల్లా పిటపిట మంటున్నావ్. తేనె తీసుకరాలేదా."

"లేదమ్మగోరూ!...సిన బాబుగోరు లేరా?" తలపైకెత్తి వాకిలిగుండా నిక్కినిక్కి లోనికి చూస్తూ అడిగింది ఊర్మిళ ..

"ఛీ..ఛీ... సిగ్గులేదూ....ఇంకా నువ్వేం చిన్నదానివా? ఇంకానయం ఎవ్వరూ చూడలేదు..... వాడికి పెండ్లీడు వచ్చింది,"గేటు దబాలున మూసేసి విసుదుగా లోనికివెళ్ళి పోయింది ఆమె.

ఊర్మిళ దిగులుగా గేటువద్దనే నిల్చుంది. భానోజీ స్కూటర్లో వచ్చాడు. అతణ్ణి చూస్తూనే ఊర్మిళకు సిగ్గు ముంచుకొచ్చింది. గేటు తీసి తలవంచుకొని నిల్చుంది. అతడు స్కూటర్ నేరుగా షెడ్డులోకి పోనిచ్చాడు.

ఊర్మిళ భానోజీ ఠీవి చూసి మురిసి పోయింది. అబ్బ ఎంత బాగా తీరాడు. ఇంకెంత సేపు..ఇంకో క్షణంలో అతడు పరుగెత్తుకొచ్చి తనను కౌగిలించుకుంటాడు.... ముద్దు పెట్టుకుంటాడు. ఆ తలపుతో ఒళ్ళు జలదరించింది. ....వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి.

షెడ్డులో స్కూటర్ పెట్టి కళ్ళపై జుట్టు సవరించుకుంటూ అంగల మీద అంగలు వేసుకుంటూ ఇంటి వైపు పరుగెత్తాడు భానోజీ. ఊర్మిళ గుండెమీద రాయిపడ్డట్టయింది.

"పినబాబూ" మెల్లిగా అంది.

"ఊఁ"! వెనుదిరిగి చూశాడు

"ఓ మాటిలా..."

భానోజీ గేటుదగ్గరకు వచ్చాడు.

"చూడూ! ఇలా వయసొచ్చిన పిల్లలు గేటుముందు నిల్చోకూడదు' అన్నాడు.

"లోనికి రమ్మన్నారా" తల వంచుకొని అడిగింది ఊర్మిళ.

"వద్దు....ఇంకెప్పుడూ ఇలా రాకు....అమ్మచూస్తే నిన్ను నరికి పోగులు పెడుతుంది.

"పోనీ మీరు మా గూడెం ఓ మాటు వస్తారా"

"ఛీ! ఛీ....లంబాడీ సిసు... లక్షలిస్తే మాత్రం వస్తానా! ఇదిగో పిల్లా! పిచ్చిపిచ్చి ఆలోచనలు మాని పెండ్లిజేసుకో... పో..." అనేసి ఇంట్లోకి పరుగెత్తుకెళ్ళాడు భానోజీ.

ఊర్మిళకు ఆమె తల్లిదండ్రీ మనువులు చూశారు. ఆమె ఎవరినీ ఒప్పుకోలేదు. ఆ పైనుండే దేవుడు ఎప్పటికైనా తన దేవుడి కాళ్ళ దగ్గర ఇంతచోటు చూపించక పోతాడా అనిఆమెనమ్మకం. ఆ నమ్మకంతోనే ఆమె పదేళ్ళు గడిపింది.

ఈ లోగా ఆమె తల్లిదండ్రీ కాలమై పోయారు. ఆమె తేనె అమ్మింది. వెదుళ్ళు చీల్చింది. బుట్ట లల్లింది. దూది తీసింది. మేకలు మేపింది. అన్నికష్టాలూ చేసింది. భానోజీని మరచిపోవడానికి ఒక్క రోజు గూడా ప్రయత్నించలేదామె.

పదేళ్ళ తర్వాత భానోజీ అరకులో గెస్టహౌస్‌లో దిగి ఉన్నాడని తెలిసి పరుగెత్తికెళ్ళింది ఊర్మిళ. అన్నేళ్ళ తర్వాత అతణ్ని అక్కడే చూసింది. ప్రక్కనే విలాసంగా వేషం వేసుకొని కూర్చుని ఉన్న

అతని భార్యతోబాటు.

"పినబాబూ! బాగున్నారా. నేను ఊర్మిళను" అంది.

"నువ్వేనాతల్లీ! మా ఆయన కోసం గేటుముందు పడిగాపులు గాపిందీ," వింతగా నవ్వింది ఆమె. ఊర్మిళ గుండెపై సుత్తిపెట్టి బాదినట్లయింది. భానోజీ ఊర్మిళతో ఏమీ మాట్లాడలేదు.

ఊర్మిళ గబగబా గూడెంకేసి పరుగెత్తింది. నిముషం సేపట్లో ఉగ్గం కట్టిన చెంబుతో తిరిగి వచ్చింది.

"అమ్మగోరూ! కొండతేనె... తీసుకోండి ..చినబాబుగారికి ఇష్టమైన తేనె..." అంది ఊర్మిళ.

"ఛీ! ఛీ! పాడుతేనె. చినబాబుగారికి ఏ దేది ఇష్టమో నా కంటే నీకే ఎక్కువ తెలిసినట్టుందే...పో పో...ఇక్కణ్ణించి పో...ఆ చెంబు పట్టుకెళ్లిపో...ఊఁ!" హూంకరించింది ఆమె.

ఊర్మిళ భానోజీ వైపు చూసింది.

"సరే! అక్కడ పెట్టి కదులు" అన్నాడు భానోజీ. ఆ మాటే చాలు ఊర్మిళకు. కొండెక్కినంత సంతోష పడింది. తేనె అక్కడే ఇచ్చి వచ్చేసింది.

ఆరాత్రి ఆకు నూరుకొని తింది ఊర్మిళ. ఊపిరిపోలేదు. డాక్టర్ని తీసుకొని వచ్చాము. బ్రతికిబయట పడింది.

ఊర్మిళ ఎందుకు ప్రాణాలు తీసుకోవాలనుకున్నదో గూడెంలో ఎవరికీ తెలియదు. నాకు మాత్రం తెలుసు...ఊర్మిళ తన మనసువిప్పి నాకదివరకే అంతా చెప్పింది. నాతో చెప్పుకున్నప్పుడే ఆమెకు కొంత ఊరట.

ఊర్మిళ ఆత్మహత్య చేసుకో ప్రయత్నించినట్టు నేను భానోజీ రావుతో అన్నాను. ఆమెకు జీవితం మీద విరక్తి కలిగి అలా చేసిం దన్నాను.

"విరక్తి ఎందుకు? నేను ఆమెన్ను ఎప్పుడూ ఏమీ అనలేదే" అన్నాడు భానోజీ.

ఆ మాటే నేను ఊర్మిళతో చెప్పాను. ఆమెకు ఆ మాత్రంచాలు. ఆ మాటలే సగం బలాన్నిచ్చాయి. అదేమిటో అతనిపైన అదేమి అభిమానమో! వెర్రివ్యామోహం.

ఇప్పుడు రెండు నెలలుగా జబ్బు పడింది ఊర్మిళ. భానోజీని ఒకసారి చూడాలని ఆమె తాపత్రయం. నేనామె కోర్కెను పేటకు వెళ్ళి భానోజీరావుతో చెప్పాను. అతను రాకపోతేమానె, నన్ను తన్నకుండా పంపినందుకు నేను అదృష్ట వంతుణ్ని"

ఊర్మిళ విషయాలు సన్యాసిరావు చాలా సహజంగా కళ్ళకు కట్టినట్లు చిత్రించిచెప్పాడు.నా కళ్ళు చెమ్మగిల్లాయి.

* *

మరురోజు గూడెం వెళ్ళాను. ఊర్మిళకు కొంత ఆయాసంతగ్గింది. నన్ను చూసి నమస్కారంచేసి "కూకోండి డాకటర్ బాబూ" అంది

సహదేవుని భార్య అటు ప్రక్కనే ఉంది.మంచం వాల్చింది. కూర్చున్నాను.

"డాకటర్ బాబూ! మీరు నాకో సాయం చెయ్యాలి. అయ్యోర్రు నా సంగతంతా మీకు నిన్న సెప్పారంట. నేను ఇంక బతకను. నాకాడ కొంచెం పైకముంది. అది నేను సచ్చిన తరువాత సినబాబు గోరికి చేరే యిదాయకం మీరు సూడాల" కంటనీరు పెట్టుకుంటూ అంది ఊర్మిళ. సహదేవుని భార్య చేతికి తాళం చెవి యిచ్చింది. ఆమె పెట్టె తెరచి ఒక జాలీ మూట తీసుకొచ్చింది.

"బాబుగారూ! అది నేను కట్టపడి కూడబెట్టిన పైకం. సినబాబుకోసం బతికాను. ఆయనకే నా బతుకంతా ఇచ్చాను, ఇదీ ఆయనకే సెందాల. అదే దరమం. ఇది మీరట్టుకెల్లి బద్రంసెయ్యండి." అంది. సహదేవుడిభార్య మూట నా చేతికిచ్చింది.

ఇంటికివచ్చి డబ్బు లెక్కపెట్టాము నేను, సన్యాసిరావూ. పంద్రెడు వందలా యాభైమూడు రూపాయలుంది.

ఆ తర్వాత వారం రోజుల్లోనే ఊర్మిళ చచ్చిపోయింది. గూడెమంతా గొల్లుమంది. పుణ్యస్త్రీగానే పంపివేశారామెను.

ఊర్మిళ నాపై పెట్టిన బాధ్యత నెరవేర్చడానికి భానోజీరావు ఇంటికెళ్లాను. సన్యాసిరావు నాతో రావడానికి ఇష్టపడలేదు.

"ఊర్మిళ చివరివరకూ మిమ్మల్నే తలచుకుంటూ ప్రాణాలు పదిలింది" అన్నాను భానోజీతో. అతని భార్య ప్రక్కనేవుంది.

"మీరుకూడా అలా అనడం భావ్యంకాదు డాక్టరుగారూ! అది బ్రతికినన్నాళ్ళూ నన్ను వేధించింది. నా పరువుతీసింది" అన్నాడు.

"చచ్చినతరువాత కూడా మీపరువును మీకు వదిలేటట్లులేదు. పదిమందికీ తెలిపి మరీ చచ్చింది. ఇప్పుడు డాక్టర్ గారు, రేపు ఇంకొకరు. చాలు చాలు. మీ పేరు ఆ లంబాడి దానితో ముడిపెట్టి ముచ్చట్లు చెప్పుకోవడానికి" చాలా కటువుగా అంది ఆమె.

నాకు చాలా బాధవేసింది....పని

పూ ర్తికానిదే వెళ్ళిపోవడం ధర్మం కాదు.

"ఆమె చివరగానన్నొక కోరిక కోరింది...మిమ్మల్ని కలుసుకొని."

"ఇక ఆపండి! నన్ను కలుసుకొని....దాని ఆస్తికలు ఇచ్చి, స్వయంగా నన్నే గంగలో నిమజ్జనం చెయ్యమని చెప్పింది.... అంతేనా" పండ్లు కొరుకుతూ అన్నాడు భానోజీ.

"కాదు! మీరు ఉద్రేకంలో ఉన్నారు. ఆమె కూడబెట్టిన డబ్బు పంద్రెండు వందలకు పైచిల్లర నా చేతికిచ్చింది. అది మీ కిమ్మంది. తను ఇన్నాళ్ళూ బ్రతికి ఉండడానికి ఆశలు పెంచి, ఊపిరిపోసిన మీకే అది దక్కాలని కోరింది." అన్నాను

భానోజీ, అతని భార్యా తెల్ల మొహం వేశారు. నోట మాట రాలేదు.

"తీసుకోవడం మీకు అభ్యంతరం అయితే.... నేనే దీన్ని ఏనిధికో చేరుస్తాను" అన్నాడు

"ఇచ్చి పంపిన డబ్బు తీసుకోకపోవడం ధర్మంకాదు. తీసుకోండి. దానికోరికమనం మాత్రం కాదనడం ఎందుకు" అంది భానోజీ భార్య.

"అలాగైనా దాని ఆత్మ శాంతిస్తుంది" డబ్బు అందుకుంటూ అన్నాడు భానోజీ.

డబ్బు ఇచ్చివేసి వెనుదిరిగి వస్తున్నాను. గేటు దాటేలోగానే "డాక్టరుగారూ,చూడండీ.ఓ మాట" పిలిచాడు భానోజీ. నేను గేటువద్దే నిల్చుండిపోయాను. తిన్నగావచ్చి అన్నాడు భానోజీ.

"దానికి ఒక యిల్లుఉందిగదూ.... దాన్నేంజేసింది"

"ఏం! మీరు కొంటారా!" అన్నాను. "నేను కొని ఏం జేసుకుంటాను. ఎవరైనా కొనేవాళ్ళుంటే చూడండి....నేనుగూడా ఒకరోజు వస్తాను. అమ్మేద్దాం. అమ్మేసి ఆ డబ్బు మా అమ్మాయిపేర డిపాజిట్ వేద్దాం....దాని తృప్తికోసం" అన్నాడు భానోజీ

"లేదు....ఆ యిల్లు సహదేవుడికి వ్రాసియిచ్చింది....ఆఁ....చెప్పడం మరిచాను. ఆమె ఎవరికివ్వాలో చెప్పకుండా మిగిల్చిపోయిన ఆమె ఆస్తి....రెండు మేకలూ....ఒక కుక్క ఉన్నాయి.మీరు కావాలంటే తోలి పంపుతాను" అన్నాను.

"డాక్టర్‌గారు చాలా చతురులు. వేళాకోళంబాగాఆడుతారు"నవ్వుతూ గేటుమూసి లోనికెళ్ళాడు భానోజీ.

* *

"ఇప్పుడుచెప్పు పరాత్పరరావ్! ఊర్మిళవంటివాళ్ళు ఈతరంలోనూ ఉన్నారు. లేరంటావా?" అన్నాను.

"డాక్టరుగారు మంచి కథకులు. కథలు బాగా చెప్పుతారు" అనేసి, కండ్లజోడు తీసిపెట్టి కాళ్ళుచాచి పడుకున్నాడు పరాత్పరరావు. *